క్లుప్తంగా

నేడు రామలింగేశ్వరస్వామి కల్యాణం


రామలింగేశ్వరునికి లక్ష పత్రి పూజ చేస్తున్న అర్చకులు

సీతంపేట: స్థానిక శంకరమఠం రోడ్డులో గల రామలింగేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల్లో తొలి రోజు గణపతి పూజ, రామలింగేశ్వరునికి రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ, ధ్వజారోహణ, అంకురారోహణ నిర్వహించారు. శనివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి కల్యాణం, ఆదివారం వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో రమాభాయి తెలిపారు.

కౌమార దశపై అవగాహన


అవగాహన పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కిశోర బాలికలు

మద్దిపాలెం: కౌమార దశపై అవగాహన కలిగి ఉండాలని కిశోర టీం సభ్యులు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం సమ్మర్ క్యాంపెయిన్ ద్వారా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం ,లక్ష్యాలు నిర్ధారించుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కౌమారబాలికలను సాధికార పరచడం, రక్త హీనత సమస్యను అధిగమించేలా చేసి, చదువు, వృత్తుల్లో వారికి సహాయం చేయడం, ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించేందుకు ఈ వేసవి శిబిరం ఉపయోగపడుతుందన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను చైతన్యం పరచడంలో దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కిశోర టీం కన్వీనర్ (మహిళా సంరక్షణ కార్యదర్శి) వరలక్ష్మి,అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ, ఏఎన్ఎం టి.స్రవంతి,ఆశ వర్కర్ వెంకటలక్ష్మి,కిశోర బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్దిపాలెం: ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్ల పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-2 ఈఈ బీకే నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెన్నేటినగర్, కళింగనగర్, సీతన్నగార్డెన్స్, లేన్సమ్ గ్రీన్స్ ఫీడర్ల పరిధిలో కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రీ విద్యామందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్‌గోడౌన్ జంక్షన్, తెన్నేటినగర్, మాధవస్వామి టెంపుల్ రోడ్డు,కళింగనగర్, ఎంఎస్ఆర్ పార్కు రోడ్డు,సాయిరాం పార్లర్ జంక్షన్ నుంచి వాటర్ ట్యాంక్ రోడ్డు వరకు,లేన్సమ్ గ్రీన్స్ అపార్టుమెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని,వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీఓఎస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి, సుప్రభాతం చదివి, వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

అల్లుకున్న నిర్లక్ష్యం


తాటిచెట్లపాలెం హైవే పక్కన రైల్వే క్వార్టర్స్‌లో...


మధుసూదన నగర్ మెయిన్‌రోడ్‌లో స్ట్రీట్‌లైట్స్ పైకి ఎగబాకిన మొక్కల తీగలు


గుబురుగా అల్లుకున్న మొక్కల తీగలు



తాటిచెట్లపాలెం: వీధి లైట్లు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రధాన రహదారుల్లో చీకట్లు అలుము కుంటున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.. మరో వైపు ప్రమాదాలు కూడా పొంచిఉన్నాయి. జీవీఎంసీ పరిధి కై లాసపురం, తాటిచెట్లపాలెం, మధుసూదననగర్ తదితర పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, కరెంట్ వైర్లను మొక్కల తీగలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. చెట్లకు కరెంటు ప్రసారమైతే మనుషులకు, జీవాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఈ మొక్కల తీగలు స్తంభాలకు మాత్రమే పరిమితంకాగా, మరికొన్ని చోట్ల వైర్లను కూడా అల్లుకున్నాయి. కైలాసపురం నుంచి మాధవధార వెళ్లే రోడ్డులో కూడా చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు, వైర్ల పైకి పిచ్చిమొక్కలు, వాటి తీగలు వ్యాపించాయి. కైలాసపురం జంక్షన్ బస్టాప్ సమీపంలో పాత పోస్టాఫీసు ఎదురుగా చాలా గుబురుగా స్తంభాలు, వైర్లపైకి తీగలు ఎగబాకాయి. కొన్ని చోట్ల వీధి దీపాల వెలుగు బయటకు రాకుండా అల్లుకున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు రాత్రి వేళ చీకటిలో ప్రయాణించాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మొక్కల తీగలు ఎండిపోయాయి. పొరపాటున మంటలు వ్యాపించినా, ఎవరైనా ఆకతాయిలు వీటి సమీపంలో అగ్గి రాజేసినా వైర్లు దగ్ధమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, వైర్ల చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.


కైలాసపురం ప్రాంతంలో విద్యుత్ వైర్లు, స్తంభం కనబడనంతగా అల్లుకున్న పిచ్చిమొక్కలు

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు


సీతంపేట మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

సీతంపేట: స్థానిక సీతంపేట మెయిన్‌రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ సిబ్బందితో శుక్రవారం తొలగించారు. గురుద్వారా నుంచి సీతంపేట కూడలి వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసి టిఫిన్ బళ్లు, బిర్యానీ పాయింట్లు, పకోడీ బళ్లు, ఇతర వ్యాపారాలకు సంబంధించిన స్టాళ్లను తొలగించారు. ఫుట్‌పాత్‌లను, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల పాదచారులు నడవడానికి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని సీఐ ప్రసాదరావు తెలిపారు. ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

దోమల నియంత్రణతోనే డెంగ్యూ నివారణ


ఎన్జీజీవోస్‌కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ నగర్ యూపీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది


ర్యాలీ నిర్వహిస్తున్న నరసింహనగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది

సీతంపేట: దోమల నియంత్రణతోనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించి, కరపత్రాల పంపిణీ చేశారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలు, ఆశావర్కర్లు, జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ మలేరియా విభాగం, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బంది సంయుక్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమల నియంత్రణ చర్యలు, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు పంచారు.

నరసింహనగర్‌లో...

నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారి మధులత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధులత మాట్లాడుతూ చెక్, క్లీన్, కవర్ అనే మూడు జాగ్రత్తలు పాటించడం ద్వారా దోమలు పెరగకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ రామలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ రవికుమార్, ఫార్మసిస్ట్ సూర్యప్రభ, స్టాఫ్‌నర్సు ఎస్తేరు రాణి, ఏఎన్ఎం సత్యవతి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెంలో...

స్థానిక ఎన్జీజీవోస్‌కాలనీలో గల విద్యుత్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుధీర్ మాట్లాడుతూ వారానికి ఒకరోజు డ్రై డేపాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చన్నారు. దోమ కాటు నుంచి రక్షణకు దోమతెరలు వినియోగించాలని, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం నుంచి ఎన్జీజీవోస్ కాలనీలోపలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ కామరాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

మహారాణిపేట: పరిసరాల పరిశుభ్రతతో డెంగ్యూను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ 1964లో విశాఖలో తొలి డెంగ్యూ కేసు నమోదైందన్నారు. అప్పుడు ఈ వ్యాధి దోమ ద్వారా వచ్చిన వైరస్‌గా గుర్తించి చికిత్స అందించారని తెలిపారు. జ్వర లక్షణాలను వివరించారు.. జ్వరం ఉధృతంగా రావడం, కండరాలు కీళ్ల నొప్పులు, వాంతి వచ్చినట్టుగా భ్రాంతి ఉంటుందన్నారు. నోరు ఎండిపోవడం, రక్తపోటు నమోదు చేయలేనంతగా పడిపోవడం జరుగుతాయన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

డ్రైడే పాటించాలి..: ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.రాధారాణి మాట్లాడుతూ డెంగ్యూను సకాలంలో గుర్తించి, చికిత్స అందిస్తే రోగిని కాపాడుకోవచ్చన్నారు. అలాగే వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ జ్వరాన్ని అదుపులో ఉంచవచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి తులసి, జీవీఎంసీ బయోలజిస్టు జి.సాంబమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సీపీ శంఖబ్రత బాగ్చి

అక్కిరెడ్డిపాలెం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. గాజువాక సెలస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో శుక్రవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సైబర్ నేరాల వల్ల పౌరులు ఎలా నష్టపోతున్నారు... నేరాలను ఎలా అరికట్టాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు.దేశంలో దారిదోపిడీ, హౌస్ బ్రేకింగ్ వంటి నేరాల్లో రూ.80 కోట్లు తస్కరిస్తే... సైబర్ నేరాల్లో రూ.220 కోట్లకు పైగా నేరగాళ్లు తస్కరించారన్నారు. పెహల్గాం ఘటన తర్వాత పాకిస్తాన్ హ్యాకర్స్ ఇండియన్ వెబ్ సైట్లను హ్యాక్ చేశారన్నారు. గాజువాక సీఐకు నగర పోలీస్ కమిషనర్ డబ్బులు అడుగుతున్నట్టు మెసేజ్ వచ్చిందన్నారు. సీఐ ఫోన్ చేయడంతో అసలు విషయం బయట పడిందన్నారు. కస్టమర్ కేర్ ఫ్రాడ్, యూపీఐ లాటరీ, జాబ్ కేవైసీ ఫ్రాడ్‌లలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్ ఫ్రాడ్ వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వెబ్‌సైట్లను విజిట్ చేస్తే సైబర్ నేరగాళ్లు కనిపెడుతూనే ఉంటారని.. అలాంటి వారిని డిజిటల్ అరెస్ట్ పేరిట బయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తారని వివరించారు. ఎవరు భయపడకుండా సైబర్ నేరగాళ్ల బారిన పడిన వెంటనే 1930కు ఫోన్ చేస్తే వారి బారి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీపీ- 2 మేరీ ప్రశాంతి, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి, క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రవికుమార్, సెలస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. విశ్రాంత ఉద్యోగి రమణారెడ్డి పాల్గొని విద్యార్థులకు చిత్రలేఖనం ప్రాధాన్యాలను తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించారు. పర్యావరణ పరిరక్షణ, మీకు నచ్చిన చిత్రం వంటి అంశాల్లో చిన్నారులు చిత్రాలు గీసారు. లైబ్రేరియన్ వై.పద్మజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

రైల్వేస్టేషన్‌లో 32.5 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అరెస్టు చేసి, 32.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ సిబ్బంది, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రలోని థానే జిల్లాకు చెందిన లక్ష్మణ్ ఎన్.భండారి, తిప్పేగారి బుగ్గమ్మలు విశాఖపట్నం స్టేషన్ మీదుగా ముంబైకి గంజాయిని రవాణా చేస్తుండడాన్ని గుర్తించి, అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.62లక్షల విలువైన 32.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచినట్టు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

పాలిథిన్ కవర్లు స్వాధీనం


తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు పరిధి సీఎంఆర్ సెంట్రల్ పక్కన గల స్ట్రీట్ వెండర్స్ షాపులపై వద్ద జీవీఎంసీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి, పాలిథిన్ కవర్లను స్వాధీనం చేస్తున్నారు. పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్న వారికి అపరాధరుసుం విధించారు. సుమారు మూడు కిలోల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. ఈ దాడుల్లో 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సచివాలయ సెక్రటరీలు మోహన్, పద్మజ, షారోన్, సతీష్, సూపర్‌వైజర్లు కోట రమణి, మణి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మద్రిపాలెం:జీవీఎంసీ 53వ వార్డులో మద్రిపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న పార్వతీనగర్ గ్రీన్ బెల్ట్ పార్కు అభివృద్ధి పనులకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వాకింగ్ ట్రాక్, ఆట పరికరాలు, జిమ్ పరికరాలతో పాటు ఇతర అభివృద్ధి పనులకు రూ.19.95 లక్షలు మంజూరైనట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

54వ వార్డులో :

కంచరపాలెం:జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా, కంచరపాలెం పరిధిలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.50.10 లక్షలతో జ్యోతినగర్ గ్రీన్‌బెల్ట్ పార్కు అభివృద్ధి, లక్ష్మీనగర్‌లో ప్లే గ్రౌండ్, వివేకానందవీధిలో చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ చల్లా రజినీఈశ్వరరావు, జీవీఎంసీ జోన్-5 ఇంజినీరింగ్ ఈఈ దిలీప్, ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


పార్వతీనగర్ లో శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు,ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

జోన్ల పునర్ వ్యవస్థీకరణకు సలహాల స్వీకరణ

కంచరపాలెం: జీవీఎంసీ పరిధిలో పరిపాలనా సౌలభ్యం కోసం జోన్ల పునర్ వ్యవస్థీకరణకు శుక్రవారం సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతిపాదనలు చేసేందుకు జోన్-5 జోనల్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం దిశగా మార్పులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జోన్‌కు సంబంధించి ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలను స్వీకరించినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పలు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రాము

సేవా కార్యక్రమాలపై వనితా వాకర్స్ క్లబ్ ప్రణాళిక

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు మురళీనగర్ వనితా క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి తెలిపారు. వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో వనితా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న జూన్ నెలలో నిర్వహించవలసిన సేవాకార్యక్రమాలపై చర్చించారు. జూన్ 2న సర్వసభ్య సమావేశం, 5న పర్యావరణ దినోత్సవం, 13న మాధవదార జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, 20న బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం, 21న అంతర్జాతీయ యోగా దినోత్సం నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, బులిటెన్ ఎడిటర్, సీహెచ్.పద్మావతి, సీనియర్ సభ్యులు ఆర్.స్నేహలత, జి.షీలారాణి, కార్యవర్గ సభ్యురాలు ఎం.స్వాతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు ప్రభావతి

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు.


కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం


హోమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు పరిధి గణేష్‌నగర్‌లో గల త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో శుక్రవారం ఆలయకమిటీ సభ్యులు, భక్తులు లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ఈ హోమాన్ని నిర్వహించినట్టు వారు చెప్పారు. ఈ నెల 22న వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటలకు ఆలయంలో హనుమాన్ విగ్రహానికి సింధూరపూజ నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.